సాక్షి
సిద్దిపేట
శనివారం । 6 । జూలై । 2024



దుబ్బాక పట్టణంలో మొక్క నాటుతున్న చైర్‌పర్సన్ గన్నె వనిత తదితరులు



సిద్దిపేట జోన్: మొక్క నాటి నీరు పోస్తున్న మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి, అధికారులు, నాయకులు

కదిలిన జనం.. కావాలి వనం

ఉత్సాహంగా వనమహోత్సవం..

వనమహోత్సవ కార్యక్రమం శుక్రవారం ఉత్సాహంగా ప్రారంభమైంది. జిల్లా వ్యాప్తంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు భాగస్వాములయ్యారు. హుస్నాబాద్‌లో మంత్రి పొన్నం, కలెక్టర్ మనుచౌదరి మొక్కలను నాటారు. అందరి సహకారంతో కార్యక్రమాన్ని సక్సెస్ చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి మొక్కకు నచ్చిన పేరు పెట్టి సంరక్షించాలని అన్నారు. జిల్లాలో 21 లక్షలకు పైగా మొక్కలు నాటేలా ప్రణాళిక రూపొందించారు. అందుకు యంత్రాంగం సైతం చర్యలు చేపట్టింది.

న్యూస్‌రీల్

జెడ్పీ ప్రత్యేక అధికారిగా కలెక్టర్



సిద్దిపేటజోన్: జిల్లా ప్రజా పరిషత్ ప్రత్యేక అధికారిగా కలెక్టర్ మనుచౌదరి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. జెడ్పీ చైర్‌పర్సన్, సభ్యుల పదవీ కాలం గురువారం నాటితో ముగిసిన విషయం తెలిసిందే. నూతన సభ్యుల నియామకం జరిగే వరకు జెడ్పీ ప్రత్యేక అధికారులుగా ఆయా జిల్లా కలెక్టర్లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో జెడ్పీ ప్రత్యేక అధికారి హోదాలో కలెక్టర్ పాలన పర్యవేక్షణ చేయనున్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి

సంస్థ రాష్ట్ర సంచాలకులు ఏవీఎస్ రాజు



ఏవీఎస్ రాజును సన్మానిస్తున్న సిబ్బంది, నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని, ఉన్నత ఉద్యోగాలు సాధించాలని గ్రంథాలయ సంస్థ రాష్ట్ర సంచాలకులు ఏవీఎస్ రాజు అన్నారు. రాష్ట్ర సంచాలకులుగా పదోన్నతి పొందిన తరువాత జిల్లా గ్రంథాలయాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏవీఎస్ రాజును టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వర్, కార్యదర్శి విక్రంరెడ్డి, పాఠకులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏవీఎస్ రాజు మాట్లాడుతూ సిద్దిపేట గ్రంథాలయాన్ని అన్ని హంగులతో పాఠకులకు అందుబాటులో ఉందన్నారు. పాఠకులకు కావాల్సిన పుస్తకాలు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచుతున్నామన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ సిబ్బంది తిరుపతిరెడ్డి, దాసరి రాజు, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

నిరుద్యోగులకిచ్చిన హామీలు ఏమాయె..

ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: నిరుద్యోగులకిచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై మండిపడ్డారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల నేడు నిరుద్యోగ యువత రోడ్లపైకి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. రెండు లక్షల జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించడంతోపాటు మెగా డీఎస్సీని వేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల జీవితాలతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటమాడుతోందని మండిపడ్డారు. 18ఏళ్లపైబడిన ప్రతి నిరుద్యోగ యువతకు ఎలక్ట్రిక్ స్కూటర్‌ను ఇస్తానన్న హామీని ప్రభుత్వం మరిచిపోయిందన్నారు. నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలు నెరవేరేంతవరకు పోరాడుతామన్నారు.

సివిల్స్‌కు ఉచిత శిక్షణ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఉచిత సివిల్స్ శిక్షణకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి కవిత శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాదులోని ఎస్సీ స్టడీ సర్కిల్లో రెసిడెన్షియల్‌తో కూడిన ఉచిత శిక్షణను అందజేయనున్నట్లు తెలిపారు. ఇందుకోసం డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు జూలై 10 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకొనే అభ్యర్థులు మూడు లక్షల లోపు ఆదాయ ధ్రువ పత్రం కలిగి ఉండాలన్నారు. జూలై 21న ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. ప్రవేశ పరీక్షల్లో వచ్చిన మెరిట్ మార్కుల ఆధారంగా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సీట్లు కేటాయిస్తారని తెలిపారు. అర్హులైన అభ్యర్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డబుల్ పెన్షన్.. రికవరీ!

రెండు పెన్షన్లు పొందుతున్న వారి గుర్తింపు



పెన్షన్ దారులు వీరే..	
వృద్ధాప్య	60,630
వితంతువు	55,674
బీడీ కార్మికులు	45,578
గీత కార్మికులు	3,001
చేనేత	2,276
దివ్యాంగులు	14,041
ఒంటరి మహిళ	3,443
హెచ్ఐవీ	1,004
ఫైలేరియా	2,541
డయాలసిస్	108
బీడీ టేకేదార్	274

- 99 మంది నుంచి రూ.70లక్షలు వెనక్కి తీసుకోవాలని ఆదేశాలు
- నోటీసులు జారీ చేసిన ట్రెజరీ
- జిల్లాలో చేయూత పెన్షన్ దారులు 1,88,570

సిద్దిపేటకు చెందిన ఓ ప్రభుత్వ పెన్షన్‌దారుడు మృతిచెందాడు. దీంతో పెన్షన్‌దారుని సతీమణికి ప్రభుత్వ పెన్షన్ అందుతోంది. సదరు వృద్ధురాలు 2014 నుంచే ఆసరా, ఇప్పుడు చేయూత పెన్షన్ పొందుతోంది. ఇటీవల ట్రెజరీ అధికారులు గుర్తించి డీఆర్‌డీఏ అధికారులకు జాబితాను పంపించారు. దీంతో సదరు వితంతువు నుంచి రూ.1.74లక్షల రికవరీకి ఆదేశించారు. చేయూత పెన్షన్‌ను గత నెల నుంచి నిలిపివేశారు.

సిద్దిపేటకు చెందిన బీడీ కార్మికురాలైన మహిళకు చేయూత పథకం కింద పెన్షన్ వస్తుంది. ప్రభుత్వ ఉద్యోగ పెన్షన్ దారుడైన భర్త మృతిచెందడంతో సతీమణికి ప్రభుత్వ పెన్షన్ సైతం అందిస్తున్నారు. రెండు పెన్షన్లు పొందుతుండటంతో సదరు బీడీ కార్మికురాలికి చేయూత పెన్షన్‌ను నిలిపివేశారు. రెండు పెన్షన్లు పొందిన సదరు మహిళ దగ్గరి నుంచి రూ.90వేలు రికవరీ చేయాలని ఆదేశించారు.

సాక్షి, సిద్దిపేట: ప్రభుత్వ ఉద్యోగ విరమణ, సర్కారు చేయూత పెన్షన్లు పొందుతున్న అక్రమార్కులను ప్రభుత్వం గుర్తించింది. కొన్నేళ్లుగా అనర్హులు పింఛన్ డబ్బులు పొందుతున్నారు. అభాగ్యులకు చేయూతను అందించేందుకు ప్రభుత్వం చేయూత పెన్షన్‌ను అందిస్తోంది. చేయూత పెన్షన్, ప్రభుత్వ ఉద్యోగ పదవీ విరమణ పెన్షన్ పొందుతున్న కుటుంబ సభ్యులను 120 మందిని గుర్తించి గత నెల నిలిపివేసింది. వీరిలో 99 మంది సిద్దిపేట జిల్లాకు చెందిన వారు కాగా ఇంకొందరు ఇతర జిల్లాలకు చెందిన వారు ఉన్నారు. వారి నుంచి రికవరీ చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

నోటీసులు జారీ ..

రెండు పెన్షన్లు పొందుతున్న వారిని గుర్తించి వారి నుంచి రూ.70లక్షలను రికవరీ చేయనున్నారు. ఇప్పటికే ఆయా పెన్షన్ దారులకు నోటీసులను జారీ చేశారు. ఎవరి దగ్గర నుంచి ఎంత డబ్బులు రికవరీ చేయనున్నారో నోటీసులో పేర్కొన్నట్లు తెలిసింది. ప్రభుత్వ ఉద్యోగ పదవీ విరమణ పొందిన వారు పెన్షన్ పొందుతారు. ఆయా వివరాలు ట్రెజరీ శాఖలో నమోదు చేస్తారు. వారందరి ఆధార్ కార్డుల ఆధారంగా ఎక్కడెక్కడ 'చేయూత' సైతం పొందుతున్నారో గుర్తించారు. నిబంధనల ప్రకారం ప్రభుత్వ ఉద్యోగి కుటుంబ సభ్యులు, ఉద్యోగ విరమణ చేసి ప్రతి నెలా ప్రభుత్వ పెన్షన్ పొందుతున్న వారు చేయూత పెన్షన్ అనర్హులు. జిల్లాలో పలువురు అక్రమార్కులు రెండు పెన్షన్‌లు పొందుతూ ప్రభుత్వాన్ని మోసం చేస్తున్నారు.

ఇంకెందరో...

కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగి ఉన్నప్పటికీ సర్కారు అందించే చేయూత పెన్షన్ పొందుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రభుత్వ ఉద్యోగి కుటుంబంలో చేయూత పెన్షన్ పొందవద్దని నిబంధన ఉన్నప్పటికీ అదేమి పట్టించుకోకుండా పెన్షన్ పొందుతున్నారు. సిద్దిపేట, గజ్వేల్ పట్టణాల్లో కొందరు లక్షలాది రూపాయలు ఐటీ చెల్లిస్తున్న వారి కుటుంబ సభ్యులు సైతం చేయూత పెన్షన్ పొందుతున్నారని తెలుస్తోంది. నోటీసులు అందుకున్న వారు తామే ఉన్నామా ఇంకా చాలా మంది ప్రభుత్వ ఉద్యోగ కుటుంబ సభ్యులు, ఐటీ చెల్లిస్తున్న వారు సైతం పెన్షన్ పొందుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

రికవరీ చేస్తాం



ప్రభుత్వ ఉద్యోగ విరమణ, చేయూత పెన్షన్ పొందుతున్న వారిని ట్రెజరీ ద్వారా గుర్తించాం. చేయూత పెన్షన్ ద్వారా పొందిన డబ్బులను రికవరీ చేస్తాం. ఇప్పటికే వారికి చేయూత పెన్షన్ నిలిపివేశాం.

– జయదేవ్ ఆర్యా, డీఆర్‌డీఓ

రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతా



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

- హుస్నాబాద్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా
- మంత్రి పొన్నం ప్రభాకర్
- నియోజకవర్గ ప్రగతిపై సమీక్ష
- పాల్గొన్న మూడు జిల్లాల కలెక్టర్లు

హుస్నాబాద్: నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతానని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో శుక్రవారం హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధిపై మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి, కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి, హన్మకొండ కలెక్టర్ ప్రావీణ్యతో పాటు అదనపు కలెక్టర్లు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జెడ్పీటీసీల పదవీ కాలం పూర్తయినందున అధికారులే ప్రత్యేక చొరవ తీసుకొని ప్రజా సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అమలవుతున్న పథకాలు అన్ని వర్గాలకు అందేలా చొరవ చూపాలన్నారు. నియోజకవర్గ పరిధిలో రోడ్లు, ఇరిగేషన్ ప్రాజెక్టులు, తాగునీటి స్థితిగతులపై అధికారులంతా ఒక రూట్ మ్యాప్ తయారు చేయాలని ఆదేశించారు. గిరిజన నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు కుటీర పరిశ్రమల కల్పనకు కృషి చేస్తానన్నారు. నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వ భూముల వివరాలను సేకరించి ల్యాండ్ బ్యాంక్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. గౌరవెల్లి, దేవాదుల, ఎస్సారెస్పీ, మిడ్ మానేర్ ప్రాజెక్టుల ద్వారా హుస్నాబాద్ రైతాంగానికి సాగు నీరు అందేలా ప్రత్యేక కృషి చేస్తానని మంత్రి చెప్పారు.

పశుసంపద పరిరక్షణకు చర్యలు ..

నియోజకవర్గంలో విద్యా, వైద్యం, వ్యవసాయం, పాడి పంటలు, వ్యవసాయ ఆధారిత రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తామని మంత్రి తెలిపారు. ఇక్కడ పాల ఉత్పత్తి అధికంగా జరుగుతుందని, పశు సంపద పరిరక్షణకు అధికారులు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. హుస్నాబాద్ నుంచి చేపలు, మేకలు, గొర్రెలు నగరానికి ఎగుమతి చేసేలా దృష్టి సారిస్తానన్నారు. హుస్నాబాద్ ప్రాంతం టూరిజం స్పాట్‌కు అనుకూలంగా ఉందని తెలిపారు. హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు, ఎల్లమ్మ దేవాలయం, శనిగరం ప్రాజెక్ట్, మహాసముద్రం గండి, రాయికల్ జలపాతం, పీవీ నర్సింహారావు స్వగ్రామం వంగర, కొత్తకొండ వీరభద్ర దేవాలయంలను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని చెరువుల్లో పెద్ద ఎత్తున చేపల పెంపకానికి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. నియోజకవర్గంలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు గరీమా అగర్వాల్, ప్రఫుల్ దేశాయి, రాధిక గుప్తా, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మి, కిరణ్, వెంకట్‌రెడ్డి, వివిధ శాఖల జిల్లా, డివిజన్ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా కలెక్టర్ జన్మదిన వేడుకలు



కలెక్టర్ మనుచౌదరికి కేక్ తినిపిస్తున్న మంత్రి పొన్నం

హుస్నాబాద్: మోడల్ స్కూల్‌లో శుక్రవారం కలెక్టర్ మనుచౌదరి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. పాఠశాల విద్యార్థుల సమక్షంలో కలెక్టర్ సంతోషంగా జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. విద్యార్థులతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మన వాతావరణాన్ని క్లీన్‌గా, గ్రీన్‌గా ఉంచుకోవాలంటే మొక్కలు నాటి పెద్ద చేయడం ఒక్కటే మార్గమన్నారు. గెలుపు, ఓటములు సాధారణమని, ప్రతి విద్యార్థి తప్పని సరిగా అన్ని రకాల పోటీ పరీక్షల్లో పాల్గొనాలన్నారు. తద్వారా జీవితంలో ఏ విషయంలోనైనా నమ్మకం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్, మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత తదితరులు పాల్గొన్నారు.

బీజేవైఎం కలెక్టరేట్ ముట్టడి

నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్



అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

సిద్దిపేటరూరల్: నిరుద్యోగుల సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిల్లా బీజేవైఎం శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు దినేశ్ మాట్లాడుతూ నీళ్లు, నిధులు నియామకాల పేరుతో తెచ్చుకున్న ప్రత్యేక రాష్ట్రంలో నిరుద్యోగులను ఓటు బ్యాంకు గానే చూస్తున్నారన్నారు. ప్రభుత్వాలు మారినా నిరుద్యోగుల తలరాత మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత 10 సంవత్సరాలు పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఏ ఒక్కరోజు నిరుద్యోగుల సమస్యలను పట్టించుకోలేదని, ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే బాటలో నడుస్తోందని విమర్శించారు. ఎన్నికల ముందు నిరుద్యోగులకు అనేక హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ఏడు నెలలు గడుస్తున్నా నిరుద్యోగుల గురించి ఆలోచించిన పాపాన పోలేదన్నారు. మెగా డీఎస్సీని వేసి, జీవో నెంబర్ 46 ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగుల న్యాయమైన డిమాండ్లు ప్రభుత్వం పరిష్కరించాలని అన్నారు.

ఆందోళన కారుల అరెస్టు..

అనంతరం ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కలెక్టరేట్‌లో గేటు ఎక్కి లోపలికి వెళ్లే ప్రయత్నం చేశారు. దీంతో రంగప్రవేశం చేసిన పోలీసులు వారిని అడ్డుకుని అరెస్టు చేసి వాహనంలో త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రోగ్రాం కోఆర్డినేటర్ నేమునూరి ఆంజనేయులు, బీజేవైఎం నాయకులు కర్ణకంటి నరేష్, సలేంద్ర రాజు, చేపూరి విజయ్, నవీన్ రెడ్డి, గురజాల రవీందర్, కళ్యాణ్ దాస్, వరుణ్ రావు , మల్లం శ్రీను, గుర్రం శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

ఖాజీపూర్‌లో 'డెంగీ' గుబులు

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట–భూంపల్లి మండలం ఖాజీపూర్‌లో 'డెంగీ' గుబులు రేపుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఇద్దరు డెంగీ బారిన పడి సిద్దిపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా మరొకరు ఆసుపత్రిలో చేరినట్లు సమాచారం. ప్రత్యేక పాలనాధికారులు వెంటనే స్పందించి గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగుపరిచాలని, వ్యాధుల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై పీహెచ్‌సీ సీహెచ్‌ఓ జోష్ అలకనందను 'సాక్షి' వివరణ కోరగా పీహెచ్‌సీ పరిధిలో డెంగీ కేసులు నమోదు కాలేదని స్పష్టం చేశారు. కాగా ఖాజీపూర్‌లో ఒకరికి డెంగీ సోకినట్లు ఓ ప్రైవేట్ ఆస్పత్రి నిర్ధారించినట్లు తెలిసిందన్నారు. గ్రామంలో నెలకొన్న పరిస్థితులపై గ్రామంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బొగ్గు గనుల వేలాన్ని రద్దు చేయండి

- సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి
- కలెక్టరేట్ ఎదుట ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

సిద్దిపేటరూరల్: బొగ్గు గనుల వేలం పాటను వెంటనే రద్దుచేసి, సింగరేణి సంస్థకే బొగ్గు బ్లాక్‌లను కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ను ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం సంబంధిత అధికారికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సింగరేణి కంపెనీని ప్రైవేటు పరం చేయాలని చూస్తోందన్నారు. తెలంగాణలో సింగరేణి కాలరీస్ బొగ్గు గనుల తవ్వకం కోసమే స్థాపించిన ప్రభుత్వ రంగ సంస్థ అని అన్నారు. అలాంటి ప్రభుత్వ రంగ సంస్థని క్రమక్రమంగా నిర్వీర్యం చేసి కుట్ర జరుగుతోందని తెలిపారు. రూ.లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తులను కేంద్ర ప్రభుత్వం ప్రైవేటు సంస్థలకు కట్టబెడుతోందని ఆరోపించారు. పరం బొగ్గు గనుల శాఖ మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి హైదరాబాద్ కేంద్రంగానే వేలం పాట ప్రక్రియను ప్రారంభించడం తీరని అన్యాయమన్నారు. తెలంగాణకు మణిహారంగా ఉన్న సింగరేణిని కాపాడుకునేందుకు ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సింగరేణికి చెందిన 22 బొగ్గు బావుల్లో నిల్వలు అడుగంటుతున్నాయని వెంటనే కొత్త బ్లాకుల్లో తవ్వకాలు ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు గోపాలస్వామి, రాళ్ళ బండి శశిధర్, శెట్టిపల్లి సత్తిరెడ్డి, సంద బోయిన ఎల్లయ్య, జిల్లా కమిటీ సభ్యులు వెంకట్ మావో, కృష్ణారెడ్డి, చొప్పరి రవికుమార్, బాలనర్సయ్య, అరుణ్ కుమార్, శ్రీనివాస్, శిరీష పాల్గొన్నారు.

హాస్య బ్రహ్మ రచనలు చైతన్య దీపికలు

- సాహిత్యంలో ఆయన కృషి గొప్పది
- మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి
- శంకరనారాయణ విద్యాశతకం ఆవిష్కరణ



'విద్యాశతకం' ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి తదితరులు

గజ్వేల్: చదువుల ప్రాధాన్యతను చాటుతూ హాస్యబ్రహ్మ డాక్టర్ శంకరనారాయణ రచించిన విద్యాశతకం గొప్పగా ఉందని, ఇలాంటి శతకాలు నేటి సమాజానికి అవసరమని మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి అన్నారు. శుక్రవారం గజ్వేల్‌లోని జీడీఆర్ హైస్కూల్‌లో శంకరనారాయణ రచించిన విద్యాశతకంతోపాటు పట్టణానికి చెందిన స్వరకర్త రాయారావు విశ్వేశ్వర్ రావు స్వరపరిచిన ' కైలాస గిరి వాస' ఆడియోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజమౌళి మాట్లాడుతూ శంకరనారాయణ తనదైన శైలిలో రచనలు చేస్తూ సమాజంలో కొత్త చైతన్యాన్ని తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారని కొనియాడారు. సుదీర్ఘకాలం పాటు పాత్రికేయ వృత్తిలో కొనసాగి సాహిత్యంపై మమకారంతో గొప్ప రచనలు చేస్తున్నారని చెప్పారు. ఈ రచనలు ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తున్నాయన్నారు. సభకు అధ్యక్షతన వహించిన జీడీఆర్ వ్యవస్థాపకులు వల్లపురెడ్డి నర్సింహారెడ్డి మాట్లాడుతూ శంకరనారాయణ రచనల ఆవిష్కరణకు తమ పాఠశాల వేదికగా మారటం ఆనందంగా ఉందన్నారు. పాఠశాల ఉపాధ్యాయురాలు మంజుల పుస్తక సమీక్ష చేశారు. కార్యక్రమంలోచేతిరాత నిపుణులు ఎజాస్ అహ్మద్, తబలా విద్వాంసుడు దేశపతి శ్రీనివాస శర్మ, ప్రముఖ పురోహితుడు దేశపతి రాజశేఖర శర్మ, గాయని శర్వాణీ, జీడీఆర్ పాఠశాల కరస్పాండెంట్ విజయలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శంకరనారాయణను సన్మానించారు.

క్లుప్తంగా

ప్రధానోపాధ్యాయుడికి షోకాజ్ నోటీస్

కొల్చారం(నర్సాపూర్): పాఠశాల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన మండలంలోని రాంపూర్ మండల ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఆరుగొండ వెంకటరమణకు జిల్లా విద్యాధికారి రాధాకిషన్ శుక్రవారం షోకాజ్ నోటీస్ జారీ చేశారు. గత నెల 29న పాఠశాలలోని నీటి ట్యాంకులో ఎలుక అవశేషాలు లభించడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. దీనిపై స్పందించిన జిల్లా విద్యాధికారి అంసాన్‌పల్లి ప్రధానోపాధ్యాయుడితో విచారణ జరిపి, నివేదిక ఆధారంగా షోకాజ్ నోటీస్ జారీ చేసినట్లు ఎంఈఓ నీలకంఠం తెలిపారు.

మద్యం మత్తులో..

పంచాయతీ కార్యదర్శిపై దాడి

శివ్వంపేట(నర్సాపూర్) : విధుల్లో ఉన్న పంచాయతీ కార్యదర్శిపై మద్యం మత్తులో ఇద్దరు వ్యక్తులు దాడి చేశారు. ఈ ఘటన మండల పరిధి రత్నాపూర్ పంచాయతీ వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి మిషన్ భగీరథ నీరు సక్రమంగా రాకపోవడంతో గ్రామంలో సింగిల్ ఫేజ్ మోటార్ల ద్వారా నీటి సరఫరాకు కార్యదర్శి చర్యలు చేపట్టారు. రెండు రోజుల కిందట అల్లం కాలనీలో మోటారు పాడైపోవడంతో మరమ్మతుల కోసం తరలించారు. శుక్రవారం నీటి సరఫరా విషయంపై కాలనీకి చెందిన ఉట్ల రాజు, గాజుల ప్రసాద్ మద్యం మత్తులో పంచాయతీ కార్యదర్శి నాగరాజుగౌడ్‌ని బూతులు తిడుతూ దాడికి పాల్పడ్డారు. కార్యదర్శిపై దాడిని ఖండిస్తూ మండల పంచాయతీ కార్యదర్శులు ఆందోళన వ్యక్తం చేసి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

పిల్లలు చెడు మార్గంలో వెళ్లకుండా చూసుకోవాలి

జిల్లా సంక్షేమ శాఖ అధికారి శారద

సిద్దిపేటరూరల్:పిల్లలు వినియోగిస్తున్న ఫోన్లు, కంప్యూటర్లు, లాప్‌టాప్‌లను తల్లిదండ్రులు ఎప్పటికప్పుడూ పర్యవేక్షిస్తూ వారు చెడు మార్గంలో వెళ్లకుండా చూసుకోవాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారి శారద శుక్రవారం తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జాతీయ మానవ హక్కుల కమిషన్ న్యూఢిల్లీ ద్వారా జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం బాలలకు సంబంధించి అభ్యంతర కరమైన వీడియోలు, చిత్రాలు, స్టోరీలు, ఫొటోలు, కార్టూన్లు మరే విధమైన చైల్డ్ సెక్స్ వల్ అబ్యూజ్ మెటీరియల్ పాఠశాల, కళాశాల విద్యార్థుల దగ్గర ఉండకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారన్నారు. పాఠశాల నిర్వహణ కమిటీలు, స్వచ్ఛంద సంస్థలు దీనిపై పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

ఏటీఎంలు ధ్వంసం



ఏటీఎంను పరిశీలిస్తున్న ఎస్‌ఐ, బ్యాంక్ అధికారులు

రామాయంపేట(మెదక్): ఏటీఎంలో దుండగులు చోరీకి యత్నించిన ఘటన రామాయంపేట పట్టణంలో శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ఇద్దరు వ్యక్తులు ముందుగా బస్టాండు సమీపంలో ఉన్న ఏటీఎం వద్దకు వెళ్లి డబ్బుల కోసం యత్నించారు. డబ్బులు రాకపోవడంతో సీసీ కెమెరాలతోపాటు ఏటీఎం మిషన్ అద్దాలు పగుల గొట్టారు. అనంతరం సమీపంలో ఉన్న మరో ఏటీఎం వద్దకు వెళ్లి అక్కడ కూడా సీసీ కెమెరాలతోపాటు మిషన్ ధ్వంసం చేశారు. ఏటీఎంలలో డబ్బు భద్రంగా ఉందని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రంజిత్ తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

HOUSE FOR SALE

■ **Independent Houses For Sale @** Malkapur, Sangareddy 141 S/Y 1100 sft Top Quality Built-Up, E/F with N-E Entrance. Ready to Occupy, Prime Location, Bank Loan Avail. Ph: 9063510400, 9391003272 [HA-97776]

WANTED

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 95026 15217 [M-1185240]

■ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుటకు ఇంటి పని/వంట పని చేయుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం. జీ : 20K. Ph: 8977639662, 8977639663 [H-799899]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరదమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

డెత్‌స్పాట్

- ప్రమాదాలు, ఆత్మహత్యలకు కేరాఫ్‌గా అన్నాసాగర్ ఛత్రీబంగ్లా
- ఎక్కడి నుంచో వచ్చి చెరువులో దూకేస్తున్న వైనం
- ఆరు నెలల్లో ఏడుగురిపైగా మృత్యువాత
- పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలంటున్న స్థానికులు



అన్నాసాగర్ చెరువు కట్టపై ఉన్న ఛత్రీ బంగ్లా



హైదరాబాద్–నాందేడ్ రహదారిలో జోగిపేట శివారులో ఉన్న అన్నాసాగర్ చెరువు ఒకప్పుడు చుట్టుపక్కల ప్రాంతాలకు టూరిస్టు స్పాట్‌గా నిలిచేది. కానీ ప్రస్తుతం ఆత్మహత్యలు, ప్రమాదాలతో డెత్ స్పాట్‌గా మారింది. ఆరు నెలలుగా ఏడుగురిపై మృత్యువాత పడ్డారు. జీవితంపై విరక్తి చెంది, కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులు, తదితర సమస్యలతో ఇక్కడి వచ్చి నీటిలో దూకి చనిపోతున్నారు.

– జోగిపేట(అందోల్)

అన్నాసాగర్ పెద్ద చెరువు వంద ఎకరాల వరకు ఆయకట్టు ఉంది. చెరువుకు మధ్యలో సందర్శకుల కోసం దశాబ్దాల క్రితం నిర్మించిన 'ఛత్రీ బంగ్లా'ను నిర్మించారు. ఛత్రి ఆకారంలో నిర్మించి తూముపై స్లాబ్ వేశారు. నారాయణఖేడ్, జోగిపేట వైపు వెళ్లే వారు బంగ్లా వద్ద తమ వాహనాలను నిలుపుకొని సేద తీరుతారు. ప్రసిద్ధి చెందిన విశ్రాంతి కేంద్రం ఒకప్పుడు జోగిపేట పట్టణంతోపాటు హైవేపై ప్రయాణించే వారికి టూరిస్టు స్పాట్‌గా ఉండేది. సాయంత్రం అయ్యిందంటే చెరువు కట్టపై నుంచి సూర్యాస్తమయాన్ని చూస్తూ ఆనందించడానికి కుటుంబ సమేతంగా తరలివచ్చేవారు. కానీ ప్రస్తుతం ఇక్కడికి ఆత్మహత్యలు చేసుకోవడానికి వస్తున్నారు.

వరుస ఆత్మహత్యలు

- అన్నాసాగర్ చెరువు కట్ట, ఛత్రీ బంగ్లా రెండూ ఇప్పుడు డెత్ స్పాట్‌గా మారాయి. ఆత్మహత్యలు, రోడ్డు ప్రమాదాలకు నెలవుగా అయ్యాయి.
- ఇటీవల రాంసాన్‌పల్లికి చెందిన ఓ యువకుడు ఛత్రీ బంగ్లా వద్ద చెరువులోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు.
- పెద్దశంకరంపేట మండలానికి చెందిన మరో యువకుడు కుటుంబ సభ్యులతో ఫన్‌లో మాట్లాడుతూ కొద్దిసేపట్లోనే ఇంటికి చేరుకుంటానని చెప్పి.. ఇంతలోనే చెరువులో దూకి ప్రాణం తీసుకున్నాడు.
- గత నెల మెదక్‌కు చెందిన ఓ వివాహిత కుటుంబ కలహాల నేపథ్యంలో ఇదే చెరువులో దూకి బలవన్మరణానికి పాల్పడింది.
- కంగ్టి మండలానికి చెందిన ఓ యువకుడు గత నెలలో ఇదే చెరువులో ఆత్మహత్య చేసుకున్నాడు. ఆరు నెలలుగా ఏడుగురికి పైగా ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఐదేళ్ల నుంచి చూసుకుంటే సుమారుగా 30 మంది వరకు చనిపోయారు. గుర్తు పట్టని మృతదేహాలు కూడా ఈ చెరువులో లభ్యమయ్యాయి.

పర్యాటక కేంద్రంతోనే పరిష్కారం

అన్నాసాగర్ చెరువు కట్టను వెడల్పుగా చేసి, ఇరు వైపులా విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాలకు అడ్డుకట్ట వేయొచ్చని చెబుతున్నారు. సీసీ కెమెరాలు, హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలి. పర్యాటక కేంద్రంగా చేసి ఒకరిని ఈ ప్రాంతంలో కాపలా పెట్టాలని, కట్ట చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఊరికి దూరంగా ఉండటంతో అధికారులు సైతం నిర్లక్ష్యం చేశారని వాపోతున్నారు.

అధికారులు పట్టించుకోవాలి



అన్నాసాగర్ చెరువులో ఇతర ప్రాంతాల నుంచి బస్సులో వచ్చి దూకి ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. గత నెల ఓ మహిళ దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా అటు వైపుగా వెళ్లిన వారు గమనించి ఆస్పత్రికి తరలించారు. నిత్యం ఎక్కడి నుంచో వచ్చి ఇక్కడ ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. చిన్నపాటి డ్యాంగా కనిపించే ఈ చెరువుపై అధికారులు శ్రద్ధ తీసుకొని అభివృద్ధి చేయాలి.

– నర్సింహాగౌడ్, అన్నాసాగర్

తల్లిదండ్రులు మందలించారని..

కుమారుడు ఆత్మహత్య

రాయపోలు(దుబ్బాక): తల్లిదండ్రులు మందలించడంతో కుమారుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన రాయపోలు మండలం ఎల్కల్‌లో చోటు చేసుకుంది. బేగంపేట ఎస్సై భువనేశ్వర్ కథనం మేరకు.. ఎల్కల్ గ్రామానికి చెందిన మంద నర్సింలుకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు రాజు (24) ఇటీవల పని చేయకుండా ఖాళీగా తిరుగుతున్నాడు. గురువారం మధ్యాహ్నం నర్సింలు, భార్య ఏసుమణి రాజును ఏదైనా పని చేసుకోవాలని మందలించారు. దీంతో ఇంట్లో నుంచి కోపంగా వెళ్లిపోయి రాత్రి అయినా తిరిగి రాలేదు. తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం ఉదయం తమ వ్యవసాయ పొలం వద్దరు వెళ్లిన నర్సింలుకు రాజు ఉరివేసుకొని కనిపించాడు. విషయాన్ని గ్రామస్తులకు, పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఘటనా స్థలానికి వచ్చిన పోలీసులు పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి..



యాదగిరి (ఫైల్)

రాయపోలు మండలం ఎల్కల్‌లో ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. బేగంపేట ఎస్సై భువనేశ్వర్ కథనం మేరకు.. ఎల్కల్‌కు చెందిన జాల యాదగిరి (57) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇటీవల కొత్త ఇంటి నిర్మాణం చేపట్టాడు. అందుకు కొంత అప్పు చేశాడు. పంటల పెట్టుబడి కోసం మరికొంత అప్పు చేయగా.. అప్పుల వారి ఇబ్బందులు ఎక్కువయ్యాయి. దీంతో మనస్తాపానికి గురైన యాదగిరి గురువారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. గ్రామ శివారులో విద్యుత్ టవర్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

స్నానానికి వెళ్లి యువకుడు..



రాజు (ఫైల్)

అక్కన్నపేట(హుస్నాబాద్): యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన అక్కన్నపేట మండల కేంద్రంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసుల కథనం మేరకు.. మండల కేంద్రానికి చెందిన తంగళ్లపల్లి సాగర్(25) నాలుగైదు రోజుల నుంచి ఒంటరిగా ఉంటూ మానసికంగా బాధపడుతున్నాడు. హుస్నాబాద్‌లోని ఓ కళాశాలలో డిగ్రీ చదువుతూ.. మరో వైపు వ్యవసాయ పనులు చేసుకుంటున్నాడు. గురువారం వరినాట్లు మోసేందుకు కూలీకి వెళ్లి సాయంత్రం ఇంటికొచ్చాడు. వ్యవసాయ బావి వద్ద స్నానం చేసి వస్తానని తల్లిదండ్రులకు చెప్పి అక్కడే చెట్టుకు ఉరి వేసుకున్నాడు. మృత్యుడి తండ్రి రాజయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

షూటింగ్ సందడి



షూటింగ్‌లో ఓ దృశ్యం

పాపన్నపేట(మెదక్): పాపన్నపేట మండలం ఎల్లాపూర్ గ్రామంలో శుక్రవారం బోనాల పాట చిత్రీకరణ జరిగింది. డైరెక్టర్ మదన్ రూపొందిస్తున్న ఈ పాట ఆషాఢ మాసం సందర్భంగా రిలీజ్ కానుంది. అనంతరం మదన్ మాట్లాడుతూ.. మన తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా జరుపుకునే బోనాల పండుగ ప్రాధాన్యతను చూపెట్టేందుకు ఈ పాటను రూపొందిస్తున్నామని అన్నారు. షూటింగ్‌లో బలగం సినిమా రమేశ్, రేఖ, సింగర్ శ్రీ విద్య, అజయ్ గౌడ్, నీరుడి మల్లేశం, గ్రామస్తులు పాల్గొన్నారు. దీంతో అక్కడ సందడి వాతావరణం నెలకొంది.

ఈ టీచరమ్మకు ఊరంతా వీడ్కోలు



భాగ్యలక్ష్మిని సన్మానిస్తున్న గ్రామస్తులు

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని లక్ష్మీనగర్ గ్రామ పంచాయతీ మధిర గ్రామం ఆరెపల్లి ప్రాథమిక పాఠశాలలో ఏకోపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న భాగ్యలక్ష్మి బదిలీపై వెళ్తుండటంతో శుక్రవారం వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. సాధారణంగా ఇలాంటి వీడ్కోలు సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు హాజరై ఘనంగా సన్మానిస్తారు. కానీ ఈ టీచరమ్మకు వీడ్కోలు పలకడానికి ఏకంగా ఊరంతా కదలి వచ్చింది. చుట్టు పక్కల గ్రామాలకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు తరలివచ్చి మరీ ఘనంగా వీడ్కోలు పలికారు. 12 ఏళ్ల కిందట భాగ్యలక్ష్మి టీచర్‌గా విధులు నిర్వహించడానికి వచ్చినప్పుడు ఇక్కడ ముగ్గురు విద్యార్థులు మాత్రమే ఉన్నారు. ఈ క్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి ప్రైవేట్ పాఠశాలలకు పంపించకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే విధంగా ప్రోత్సహించింది. విద్యార్థులకు ఆట పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు ఇంగ్లిష్ విద్యా బోధన చేసింది. టీచరమ్మ ప్రోత్సాహంతో జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థులు పాల్గొని ప్రతిభ చాటడంతో ఆరెపల్లి ప్రాథమిక పాఠశాలకు మంచి గుర్తింపు లభించింది. ప్రస్తుతం పాఠశాలలో 112 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. టీచర్ల బదిలీల్లో భాగంగా భాగ్యలక్ష్మి సిద్దిపేటకు వెళ్తుండటంతో ఘనంగా సన్మానించారు.

విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించాలి

గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి

తొగుట(దుబ్బాక): పోలీసులు విధినిర్వహణలో బాధ్యతగా వ్యవహరించాలని గజ్వేల్ నేసీపీ పురుషోత్తంరెడ్డి అన్నారు. ఇటీవల బదిలీపై వెళ్లిన సిబ్బందికి తొగుట సీఐ లతీఫ్ అధ్యక్షతన వీడ్కోలు సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమన్నారు. ఎక్కడ విధులు నిర్వహించినా ప్రజలకు సేవచేసి మంచి గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. అనంతరం ఏసీపీని ఎస్‌ఐలు, సిబ్బంది సన్మానించారు.

ఫుడ్ పాయిజన్ కలకలం


- ఆస్పత్రి పాలైన విద్యార్థులు
- మిట్టపల్లిలోని 'సురభి' వైద్య విజ్ఞాన సంస్థలో ఘటన
- బయటి ఆహారం తినడం వల్లే అస్వస్థత : కళాశాల చైర్మన్



చికిత్స పొందుతున్న నర్సింగ్ విద్యార్థిని

సిద్దిపేటఅర్బన్: సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి సమీపంలోని సురభి వైద్య విజ్ఞాన సంస్థలో శుక్రవారం ఫుడ్ పాయిజన్ కలకలం రేపించింది. హాస్టల్‌లోని మెస్‌లో వండిన ఆహారం కలుషితమై విద్యార్థులు అస్వస్థతకు గురి కాగా గుట్టు చప్పుడు కాకుండా కళాశాల అనుబంధ ఆస్పత్రిలో వైద్యం అందించారని సోషల్ మీడియాలో వైరలైంది. దీనిపై కళాశాల చైర్మన్ హరీందర్‌రావును వివరణ కోరగా.. కళాశాలలో నర్సింగ్ విభాగానికి చెందిన సుమారు 10 నుంచి 15 మంది విద్యార్థులు గురువారం సాయంత్రం బయట నుంచి ఆహారం తెప్పించుకొని తినడంతో అస్వస్థతకు గురయ్యారని తెలిపారు. వారికి ఆస్పత్రిలో చికిత్స అందించినట్టు పేర్కొన్నారు. హాస్టల్ మెస్‌లో ఫుడ్ పాయిజన్ అయ్యిందనే ప్రచారంలో నిజం లేదని స్పష్టం చేశారు. మెస్‌లో వండిన ఆహారం 850 మందికి పైగా విద్యార్థులు తిన్నారని, ఫుడ్ పాయిజన్ అయితే తిన్న వారిలో 10 నుంచి 15 మంది విద్యార్థులు మాత్రమే అస్వస్థతకు గురి కారని, బయటి ఆహారం తినడం వల్లనే జరిగిందని తెలిపారు. కావాలని కొంతమంది విద్యార్థుల వీడియో రికార్డు చేసి దుష్ప్రచారం చేస్తున్నారని తెలిపారు.

పులి సంచారం



హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని నాగాపూర్ గేటు సమీపంలో పులి సంచారం కలకలం రేపింది. అటవీ ప్రాంతంలో రెండు చిరుత పులులు రోడ్డు పక్కకు వచ్చి నిలబడడంతో మెదక్– బోధన్ వైపు వెళ్తున్న ప్రయాణికులు కారులో నుంచి చూసి ఆ చిత్రాలను కెమెరాలో బంధించారు. పులులు సంచరిస్తున్న వీడియో వైరల్ కావడంతో ఆ ప్రాంతం గుండా వెళ్లే ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు.

కారు, ట్రాక్టర్ ఢీ

వర్గల్(గజ్వేల్): ట్రాక్టర్, కారు ఎదురెదురుగా ఢీకొన్న ఘటన శుక్రవారం సాయంత్రం వర్గల్ మండలం ముట్రాజ్‌పల్లి టర్నింగ్ వద్ద రాజీవ్‌రహదారిపై చోటు చేసుకుంది. ప్రత్యక్షసాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. ముట్రాజ్‌పల్లి వైపు నుంచి రాజీవ్ రహదారి టర్నింగ్ వద్ద మ లుపు తిరిగి రాంగ్‌రూట్‌లో వస్తున్న ట్రాక్టర్, హైదరా బాద్ వైపు వెళ్తున్న కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో రెండు వాహనాలు దెబ్బతినగా, ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. గౌరారం ఏఎస్‌ఐ మధుసూదన్‌రావు బృందం అక్కడికి చేరుకొని కారును పక్కకు తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేయించారు.

గురుకులంలో దారుణం

- పదో తరగతి విద్యార్థులపై ఇంటర్ విద్యార్థుల దాడి
- పారిబోయి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు
- ఘటనపై అధికారులు, ప్రిన్సిపాల్ చర్యలు



విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్సీఓ నిర్మల

చేర్యాల(సిద్దిపేట): స్థానిక సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో దారుణం చోటు చేసుకుంది. పదవ తరగతి విద్యార్థులపై గురువారం రాత్రి ఇంటర్ రెండవ సంవత్సరం విద్యార్థులు విచక్షణా రహితంగా దాడి చేశారు. విద్యార్థుల కథనం మేరకు.. గురుకుల పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులు వారికి కేటాయించిన గదిలో చదువుకుంటున్నారు. ఇదే క్రమంలో వీరంతా అల్లరి చేస్తున్నారని అదే హాస్టల్‌లో ఉండే కొందరు ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థులు వచ్చారు. ఒక్కసారిగా పదవ తరగతి విద్యార్థులపై బెల్టులు, కర్రలతో దాడిచేసి విచక్షణా రహితంగా కొట్టారు. దెబ్బలకు తట్టుకోలేక విద్యార్థులు పాఠశాల ప్రహరీ దూకి పరుగులు పెట్టారు. పట్టణ కేంద్రంలోని పోలీసు స్టేషన్‌కి వెళ్లి పోలీసులకు విషయం చెప్పారు. వెంటనే స్పందించిన ఎస్‌ఐ దామోదర్ పాఠశాలకు వెళ్లి ఆరాతీశారు. దీనిపై పాఠశాల ప్రిన్సిపాల్ అశోక్‌బాబు మాట్లాడుతూ.. విద్యార్థులపై జరిగిన దాడి వాస్తవమేనని, కొందరు పదవ తరగతి విద్యార్థులు గాయపడ్డారన్నారు. దాడికి పాల్పడ్డ వారిని గుర్తించామని కళాశాల నుంచి సస్పెండ్ చేయడమా, లేక మరో కళాశాలకు బదిలీ చేయడమా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. ఘటన జరిగిన రోజు రాత్రి విధుల్లో ఉండి నిర్లక్ష్యం వహించిన నైట్ స్టే అధికారి కృష్ణమూర్తి, వాచ్‌మెన్ లక్ష్మణ్‌లకు మెమో జారీ చేసినట్లు తెలిపారు.

పాఠశాలను సందర్శించిన ఆర్సీఓ..

రీజినల్ కో–ఆర్డినేటర్ నిర్మల శుక్రవారం పాఠశాల, హాస్టళ్లను సందర్శించారు. దాడికి పాల్పడిన, గాయపడిన విద్యార్థులకు కౌన్సిలింగ్ చేశారు. ఈ ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

66 మందికి సెల్‌ఫోన్లు అందజేత



బాధితులకు ఫోన్లు అందజేస్తున్న సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: కమిషనరేట్ పరిధిలో పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను గుర్తించి తన కార్యాలయంలో సీపీ అనురాధ శుక్రవారం బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో కొన్ని రోజులుగా పలువురు వివిధ రకాలుగా తమ సెల్‌ఫోన్లు పాగొట్టుకున్నట్లు సంబంధిత పోలీసు స్టేషన్లలో ఫిర్యాదు చేశారన్నారు. పోలీసు సిబ్బంది నూతన టెక్నాలజీ సీఈఐఆర్ ద్వారా గుర్తించి 66 మంది బాధితులకు వారి ఫోన్లు అందజేశామన్నారు. 2023 నుంచి ఇప్పటి వరకు 920 సెల్‌ఫోన్‌లను నూతన టెక్నాలజీ ద్వారా గుర్తించామన్నారు. ఎవరైనా సెల్‌ఫోన్ పోగొట్టుకుంటే వెంటనే సీఈఐఆర్ యాప్‌లో వివరాలు నమోదు చేసి బ్లాక్ చేయడం ద్వారా సులభంగా సెల్‌ఫోన్‌ను గుర్తించడం సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో ఐటీ సెల్ ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి, ఐటీ కోర్ సిబ్బంది స్వప్న, శ్రీకాంత్, రమేశ్, మల్లేశం స్వామి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి మొక్కలు పట్టివేత



గంజాయి మొక్కలు చూపుతున్న విద్యాచరణ్ రెడ్డి

నారాయణఖేడ్: గంజాయి మొక్కలను పెంచుతున్న ఇద్దరిని పట్టుకున్నట్లు నారాయణఖేడ్ ఎస్‌ఐ విద్యాచరణ్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. ఖేడ్ మండలంలోని హంగిర్గా (బి) వద్ద ఓ కంకర క్రషర్‌లో పని చేసేందుకు ఎనిమిది నెలల కిందట ఉత్తర ప్రదేశ్‌లోని ఘాజీపూర్ గరిహాకు చెందిన నవీన్ కుమార్ (33), అదే రాష్ట్రంలోని చిరైకోట్ పట్టణ సమీపంలోని హఫీజ్‌పూర్‌కు చెందిన సంతోష్ కుమార్ (36) వచ్చారు. వీరికి గంజాయి సేవించే అలవాటు ఉంది. వచ్చేటప్పుడు కొంత గంజాయిని వెంట తెచ్చుకున్నారు. గంజాయిని సేవించగా మిగిలిన కొన్ని విత్తనాలను క్రషర్ సమీపంలోని పిచ్చిమొక్కల మధ్య పెంచుతున్నారు. రహస్యంగా అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేసి 16 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నామని, ఇద్దరినీ అరెస్టు చేసి కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఉపాధ్యాయుడు మృతి



చంద్రశేఖర్ (ఫైల్)

చేర్యాల(సిద్దిపేట): ఆర్టీసీ బస్సు ఢీకొని ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి చెందిన ఘటన పట్టణ శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. జిల్లా కేంద్రానికి చెందిన కె.చంద్రశేఖర్(59) దూళ్మిట్ట మండలంలోని కూటిగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీజీ హెచ్‌ంగా విధులు నిర్వహిస్తున్నాడు. రోజువారిలా విధులకు హాజరయ్యేందుకు బైక్‌పై వెళ్తుండగా పట్టణ శివారులో వెనుక నుంచి ఆర్టీసీ బస్సు ఢీ కొట్టడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు మెరుగైన చికిత్సకోసం హైదరాబాద్ తరలించాలని సూచించారు. హైదరాబాద్ తరలించి ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ దామోదర్ తెలిపారు.

మూర్ఛతో పడిపోయి వ్యక్తి..

పటాన్‌చెరు టౌన్: అమీన్‌పూర్ పరిధిలోని బీరంగూడ జెడ్పీహెచ్‌ఎస్ ప్రభుత్వ పాఠశాల సమీపంలో నివాసం ఉంటున్న సతీష్ కుమార్(38)కి శుక్రవారం ఫిట్స్ వచ్చింది. కుటుంబ సభ్యులు చికిత్స కోసం చందానగర్ లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు వెల్లడించారు. మృతుడి భార్య శ్రీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

విద్యుదాఘాతంతో సెంట్రింగ్ కార్మికుడు.. మరొకరికి గాయాలు

విద్యుదాఘాతంతో సెంట్రింగ్ కార్మికుడు మృతి చెందగా, మరో కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్‌ఐ రాజేశ్ నాయక్ కథనం మేరకు.. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన రామ్ దాని కుజూర్ (37), మరో కార్మికుడు బోల బెల్ థార్ పటాన్‌చెరు డివిజన్ శివారులోని నిర్మాణ దశలో ఉన్న మకుట డెవలపర్స్‌లో పని చేస్తున్నారు. అక్కడ వర్షానికి వచ్చిన నీటిని పంపింగ్ ద్వారా సెల్లార్ నుంచి పైకి ఎక్కిస్తుండగా ఒక్కసారిగా కరెంట్ షాక్ కొట్టింది. తోటి కార్మికులు విద్యుత్ సరఫరా నిలిపివేసి వెళ్లి చూడగా అప్పటికే కుజూర్ మృతి చెందాడు. బెల్ థార్‌కు తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలి

గ్రామ పంచాయతీ కార్మికుల ఆందోళన

కొండపాక(గజ్వేల్): గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కమిటీ నాయకుడు అమ్ముల బాల్‌నర్సయ్య, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బర్మ కొమురయ్య డిమాండ్ చేశారు. తొమ్మిది నెలల బకాయి వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ సమీకృత మండల కార్యాలయాన్ని శుక్రవారం గ్రామ పంచాయతీ కార్మికులతో కలిసి ముట్టడించారు. అధికారులను లోనికి వెళ్లకుండా అడ్డుకుని నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ దిలీప్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తొమ్మిది నెలలుగా వేతనాలను చెల్లించకపోవడంతో కార్మికులు దుర్భర జీవితాలను గడుపుతున్నారన్నారు. కార్మికుల సమస్యలను సత్వరమే పరిష్కరించకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి కనకాచారి, కొండపాక, కుకునూరు మండలాల అధ్యక్ష కార్యదర్శులు ప్రభాకర్, సాయి కుమార్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం: నర్సయ్య

గజ్వేల్‌రూరల్: ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యత ఇస్తున్నట్లు గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ నర్సయ్య పేర్కొన్నారు. శుక్రవారం 2వ వార్డు క్యాసారంలో దట్టంగా పెరిగిన తుమ్మ చెట్లను తొలగించే పనులను చేపట్టారు. అలాగే 17వ వార్డులో మురుగు కాల్వలో దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశముందన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

చిన్నకోడూరు(సిద్దిపేట): అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. చిన్నకోడూరు పోలీసులు, టాస్క్‌ఫోర్స్‌కు చిన్నకోడూరు పీఎస్ పరిధి ఇబ్రహీంనగర్ గ్రామంలోని నర్సవ్వ ఇంటిలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచారనే విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో వారు వెళ్లి తనిఖీ చేయగా 50 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గుర్తించారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.